క్లుప్తంగా

అతిసార నివారణకు ముందు జాగ్రత్తచర్యలు



క్లోరినేషన్ చేసిన సంప్‌లో క్లోరిన్ శాతాన్ని పరిశీలిస్తున్న ఏఈ పవన్‌కుమార్

సీతానగరం: సీజనల్ వ్యాధి అతిసార నివారణకు ముందు జాగ్రత్తచర్యగా మంచినీరు ట్యాంక్‌లు, సీపీడబ్ల్యూఎస్‌లలో క్లోరినేషన్ చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం మరిపివలస, సూరంపేట,చిన్నారాయుడుపేట, గుచ్చిమి, జోగింపేట,అప్పయ్యపేట గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్న సీతానగరం సువర్ణముఖి నదిపైఉన్న సీపీడబ్ల్యూఎస్‌లో బ్లీచింగ్ పౌడర్ వేసిన అనంతరం క్లోరిన్ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా (అతిసార) వ్యాధి నివారణకు ముందు జాగ్రత్తచర్యగా ఆయాగ్రామాల సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల్లో క్లోరినేషన్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంప్ ఆపరేటర్ రామకృష్ణ పాల్గొన్నారు.

డివిజనల్ సర్వేయర్‌గా వెంకటరావు



బాధ్యతలు స్వీకరించిన వెంకటరావు

పాలకొండ: ఆర్డీఓ కార్యాలయం డివిజనల్ సర్వేయర్‌గా ఎస్. వెంకటరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ప్రేమ్‌కుమార్ ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో మండల సర్వేయర్‌గా ఉన్న వెంకటరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

'రక్తదానం చేసి ప్రాణదాతలు కండి'

వీరఘట్టం: రక్తదానం దానం చేసి ప్రాణదాతలు కావాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ యువతకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో హెల్పింగ్ హ్యాండ్స్ అనే సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు సైల పద్మరాజుతో పాటు నాయకులు జామి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



ఉపాధ్యాయుల పనితీరుపై ఆరాతీస్తున్న డిప్యూటీ డీఈఓ కృష్ణమూర్తి

కురుపాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. పాలకొండ డివిజన్ డిప్యూటీ డీఈఓ కృష్ణమూర్తి నేతృత్వంలో ఏడుగురు సబ్జెక్టు నిపుణుల బృందం పాఠశాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం తోట శంకరరావు, ఉపాధ్యాయులు డిప్యూటీ డీఈఓ కృష్ణమూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ నిమ్మక సత్యనారాయణ, ప్యానెల్ హెచ్‌ఎంలు భీముడు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాగిపంట సాగుతో ఆదాయం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మురళీకృష్ణ

రేగిడి: ప్రస్తుతం రాగిపిండికి డిమాండ్ ఉందని, రైతులు రాగి పంటను సాగుచేస్తే లాభాలు పొందే అవకాశం ఉందని వ్యవసాయశాఖ మండల అధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలో పారంపేట రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం రాగిపంట సాగుపై రైతులకు సూచనలు, సలహాలు అందించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగుకు ఎంపికచేసుకోవడం ద్వారా మంచి లాభాలు వస్తాయన్నారు. రొటీన్ పంటలు సాగుచేసేకంటే పంట మార్పిడి చేయడం ద్వారా భూమి సారవంతంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్

సంతకవిటి: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘునాథాచారి, తహసీల్దార్ తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి

• ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం:

వర్షాధార భూముల్లో సాగు చేస్తున్న గోగు, వేరుశనగ పంటల పట్ల రైతులు మెలకువ పాటించాలని ఏఓ ఎస్. అవినాష్ అన్నారు. ఈ మేరకు మండలంలో గోగు, వేరుశనగ పంటలు సాగు చేస్తున్న పొలాలను ఆర్బీకే సహాయకులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో వర్షాధార మెట్టభూములున్న దయానిధిపురం, గాదెలవలస, పంగంపేట, కె.ఎస్‌పురం, పీబీ పేట, జయంతిరాయపురం, జానుమల్లువలస గ్రామాల రైతులు వేరుశనగ, గోగు, వరి వెద పంటలను సాగుచేస్తున్నారని తెలియజేశారు. ఇంతవరకు కురిసిన వర్షాలకు మెట్ట భూముల్లో వేరుశనగ, గోగు పంటలు ఏపుగా పెరగడం వల్ల సస్యరక్షణ చర్యల్లో రైతులు నిమగ్నమయ్యారని తెలియజేశారు. గోగు పంట ఏపుగా పెరగడం వల్ల గోగు పంటకు ఇనుప తెగులు సోకే అవకాశం ఉందని తెగులుసోకిన సమయంలో గోగుకర్రల మొదలుకు ఇనుపతెగులు సోకి కర్రలు నల్ల మచ్చలు ఏర్పడి కర్రంతా నల్లగా మారుతుందన్నారు. తెగులు సోకిన గోగుకర్రలు చనిపోతాయని తెలియజేశారు. ఇనుపతెగులు సోకుతుందని గుర్తించిన రైతులు తక్షణమే సీఓసీ ఎరువును వేయాలని సూచించారు. వేరుశనగ పంటలో అధిక దిగుబడులు సాధించడానికి ఎకరా విస్తీర్ణానికి 50 కేజీల జిప్సమ్ వేయాలని, జిప్సమ్ వేయడం వల్ల ఆయిల్ దిగుబడి పెరుగుతుందని చెప్పారు. రెండవ విడతలో పొటాష్ వేయాలని, దీంతో నేల గుల్లబారి బలమైన కాయల దిగుబడి దోహదపడుతుందన్నారు. అలాగే మెట్టభూముల్లో వేసిన వరివెద మడులలో నాలుగు నుంచి ఐదు ఆకులతో వరి మొక్కలున్నాయని, మరికొద్దిగా పెరిగిన అనంతరం కలుపు నివారణ చర్యలు చేపట్టాలని వివరించారు. కార్యక్రమంలో ఆర్బీకే వ్యవసాయ సహాయకులు వెంకటరమణ, లక్ష్మణరావు పాల్గొన్నారు.



పీబీ పేటలో వేరుశనగ పంట



కేఎస్‌పురం పొలంలో ఏపుగా పెరిగిన గోగుపంట

విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ-1 సామల సింహాచలం, ఉపాధ్యాయులు

బలిజిపేట: సంపూర్ణత అభియాన్ మండలస్థాయి వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ-1 సామల సింహాచలం బహుమతులు అందించారు. బలిజిపేట ఉన్నత పాఠశాలలో బుధవారం ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి పోటీలు విద్యార్థులలో ఆలోచన శక్తిని పెంపొందిస్తాయని, ముఖ్యంగా పోటీ పరీక్షల్లో పాల్గొనే భయం తొలుగుతుందన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేవిధంగా పోటీలు నిర్వహించడం గొప్ప విషయమని ప్రశంసించారు. ఈ పోటీలలో చిలకలపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.లిఖిత ప్రథమ, అరసాడ ఉన్నత పాఠశాల విద్యార్థి జి.హేమంత్‌కుమార్ ద్వితీయ, చిలకలపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.ప్రవంతి తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వారికి ఎంఈఓ సామల సింహాచలం, బలిజిపేట ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు, ఎన్ఎన్‌వలస ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

అమల్లోకి వచ్చిన కొత్త నేర చట్టాలు

పార్వతీపురంటౌన్: జూలై 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై గ్రామాల్లో మరింత అవగాహన కల్పించేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని పార్వతీపురం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వెల్లడించారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అమల్లోకి వచ్చిన కొత్త నేర న్యాయ చట్టాలతో కేసుల దర్యాప్తు వేగవంతం కావడంతో పాటు విచారణ వేగం పెరిగి సత్వర న్యాయం అందుతుందన్నారు. కొత్త నేర చట్టాలు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎంఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినయం (బీఎస్ఏ), సోమవారం నుంచి అమల్లోకి తెలిపారు. క్రిమినల్ కేసుల్లో విచారణ ప్రారంభమైన తర్వాత 60రోజుల్లోగా అభియోగాలు మోపాల్సి ఉందన్నారు. విచారణ పూర్తయిన 45 రోజుల్లో తీర్పులు వెలువడనున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా బాధితులు ఇకపై నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. అమల్లోకి వచ్చిన కొత్త నేర చట్టాలపై ఆయా గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు మండల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు విద్యాసంస్థల బంద్‌కు పిలుపు



విలేకరులతో మాట్లాడుతున్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

మక్కువ: నీట్, యూజీసీనెట్ పరీక్ష పేపర్ లీకేజ్‌ను నిరసిస్తూ ఈనెల 4వ తేదీన దేశవ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్‌కు ఐక్య విద్యార్థి సంఘాలు పిలుపునిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ఎం హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో హరికృష్ణ విలేకరులతో మాట్లాడుతూ వన్ నేషన్-వన్ ఎగ్జామ్ ముసుగులో మొత్తం పరీక్ష వ్యవస్థ కుప్ప కూలిందని ఆరోపించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందన్నారు. జూన్ 4న ప్రకటించిన నీట్ పరీక్షా ఫలితాలు పారదర్శకంగా లేవని పేపర్ లీక్‌పై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో, లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారన్నారు. ఉన్నత విద్య మాత్రమే కాకుండా పాఠశాల విద్యా పరిస్థితి కూడా దారుణంగా ఉందన్నారు. కార్యక్రమంలో, ఏఐఎస్ఎఫ్ నాయకులు మండల నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఈసెట్ కౌన్సెలింగ్

పార్వతీపురంటౌన్: మండలంలోని ఎమ్మార్‌నగరంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నుంచి ఏపీఈసెటలో అర్హత సాధించిన విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ స్థానిక కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. 4 నుంచి 10 వరకు పరిశీలన, 8 నుంచి 12 వరకు ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించామన్నారు. 13న ఆప్షన్లలో మార్పులు, 16న ఫలితాలు ప్రకటిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు గురువారం ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోండి



ప్రీస్కూల్ చిన్నారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ గౌరీశంకర్

కురుపాం: అంగన్‌వాడీ కేంద్రాల సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మొండెంఖల్ గ్రామ సర్పంచ్ ఇంటికుప్పల గౌరీశంకర్ అన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న ప్రీస్కూల్ చిన్నారులకు బుధవారం ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ సేవలపై అవగాహన పెంచుకొని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రీస్కూల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సులోచన, జ్యోతి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాగర్‌వర్మ

గరుగుబిల్లి: గర్భిణుల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కేకే సాగర్‌వర్మ అన్నారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మాతా శిశు సంరక్షణ కార్డులో ఆరోగ్య తనిఖీలు, వైద్యపరీక్షల వివరాలు పరిశీలించారు. గర్భిణుల్లో జ్వర లక్షణాలు గుర్తిస్తే హైరిస్క్‌గా పరిగణించి సత్వరమే సమాచారాన్ని అందించాలన్నారు. పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రవణమ్మ, స్వాతి, సావిత్రి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక పెట్టుబడులతో ఆందోళన



మొక్కజొన్న పంటకు గొప్పలు తవ్వుతున్న కూలీలు

• వ్యవసాయ పనుల్లో బిజీగా రైతులు
• ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు

సాలూరు రూరల్:

మండలంలోని రైతులు ముమ్మరంగా కూలీల సాయంతో వ్యవసాయ పనులు చేస్తున్నారు. అయితే మొక్కజొన్న, పత్తి పంటల నాట్లు వేసే సమయంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా మొలకలు రాక ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే అయితే చేల కంటే మందుగా కలుపు పెరిగిపోయి రైతులకు ఇబ్బందికరంగా మారింది. కలుపు తొలగించడానికి కొంతమంది రైతులు గడ్డిమందు పిచికారీ చేస్తుండగా మరికొంతమంది గొప్పులు తవ్వించుకుంటున్నారు. అయితే ఈ ఏడాది కూలీలకు కనీసం కూలి డబ్బులు చెల్లించేందుకు రైతులు వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నారు. గత ప్రభుత్వంలో రైతుభరోసా క్రమం తప్పకుండా రైతులకు పెట్టుబడులు సమయానికి అందించేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఇంతవరకు రైతుభరోసా ఎప్పుడు వేస్తుందో అని రైతులు ఎదుచూస్తున్నారు. అన్నదాతను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇకమీదట రైతుల విషయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

విజ్ఞానం పెంపొందించడానికే వ్యాసరచన పోటీలు



మాట్లాడుతున్న ఎంఈఓ జి.సూరిదేముడు

సీతానగరం: విద్యార్థులకు విద్యతోపాటు విజ్ఞానాన్ని పెంపొందించడానికి వ్యాస రచన పోటీలు దోహదపడతాయని ఎంఈఓ జి.సూరిదేముడు అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యాబోధనతోపాటు విద్యార్థులకు విరామ సమయంలో జ్ఞాపక శక్తిని, విజ్ఞానాన్ని పెంపొందించడానికి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు పోటీలో పాల్గొనడం అభినందనీయమన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ముగ్గురుకి బహుమతులు అందజేయనున్నామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతికి జోగింపేట డాక్టర్‌బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ టెన్త్ విద్యార్థి ఎ.జశ్వంత్, ద్వితీయ బహుమతికి మరిపివలస ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థిని సీహెచ్ స్వప్న, తృతీయ బహుమతికి ఆర్.వెంకంపేట ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎం.రేష్మా ఎంపికయ్యారని కమిటీ సభ్యులు తెలియజేశారు. వారంతా త్వరలో జరగనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ జి.సూరిదేముడు తెలియజేశారు. కార్యక్రమంలో ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టాప్ డయేరియాపై అవగాహన



పెదపెంకి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యశాఖ అధికారులు, సిబ్బంది

బలిజిపేట: స్టాప్ డయేరియా కార్యక్రమంపై పెదపెంకి ఉన్నత పాఠశాల విద్యార్థులకు బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. బట్టలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఎప్పటికప్పుడు చేతులు పరిశుభ్రం చేసుకోవడం, ఆహారం తినేముందు చేతుల పరిశుభ్రత ఏవిధంగా చేసుకోవాలో వివరించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఆరుబయట ఈగలు ముసిరే ప్రదేశాలలో విక్రయించే తినుబండారాలను కొనుగోలుచేయకూడదని హితవు పలికారు. డయేరియా నియంత్రణ కార్యక్రమంలో బాగంగా వైద్యశాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేస్తారని వైద్యాధికారి తెలిపారు. ప్రతి ఇంట్లో 5సంవత్సరాల లోపు చిన్నారులకు డయేరియా వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎవరికైనా వాంతులు, విరేచనాలు అయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పాపారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కరరావు, ఉపాధ్యాయులు, వైద్యశాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి



మరుపెంట గ్రామసభలో పాల్గొన్న ఎంపీపీ రామారావు, తదితరులు

గరుగుబిల్లి: గ్రామస్తుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. మండలంలోని మరుపెంట గ్రామంలో సర్పంచ్ ఉరిటి నిర్మల అధ్యక్షతన బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల అభిప్రాయాలతో గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను తయారు చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్యం తదితర పనులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలితే తక్షణం గ్రామాల్లో వైద్యశిబిరాలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కె.బలరాంనాయుడు, ఎ.రామకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని రావివలసలో ఉప సర్పంచ్ జి.పద్మావతి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలపై తీర్మాణాలు చేసి అధికారులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కోట భరత్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి..



వీరఘట్టంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం: మండలంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. అందరం సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి జరుగుతుందన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో వేసిన 19 జగనన్న లే అవుట్లలో అక్రమాలు జరిగినట్లు లబ్ధిదారులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని తహసీల్దార్ జయప్రకాష్‌ను ఆదేశించారు. అలాగే రైతు సంఘాలకు ఇచ్చిన 21 ట్రాక్టర్లలో కొన్నింటిని నిబంధనలకు విరుద్ధంగా అమ్మేసినట్లు తెలిసిందన్నారు. అటువంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఏఓ జక్కువ సౌజన్యను ఆదేశించారు. తోటపల్లి పాత ఆయకట్టుకు ఈనెల 13న నీరు విడుదల చేయనున్న నేపథ్యంలో కాలువల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. సాగునీటికి రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని జలవనరుల శాఖ ఏఈ రాజేష్‌ను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు పొదిలాపు కృష్ణమూర్తి, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరి, చింతా ఉమా, తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూ సమస్య పరిష్కరించాలి



భూముల పరిశీలనకు వెళ్తున్న మాజీ ఎంపీ పి.మధు

గరుగుబిల్లి: శివ్వాం గ్రామంలోని దళితుల భూ సమస్యను రెవెన్యూ అధికారులు వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని మాజీ ఎంపీ, సీపీఎం నాయకుడు పి.మధు డిమాండ్ చేశారు. శివ్వాం గ్రామంలో వివాదస్పద భూములను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1970లో గ్రామంలోని దళితులకు 22.80 ఎకరాల భూమిని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అప్పటి నుంచి ఆ భూమిని దళితులు సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. ఆ భూమిని కొంతమంది పెత్తందారులు ఆక్రమించుకోవాలని తరచు దళితులపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. దళితులు సాగు చేసుకుంటున్న భూమిపై తప్పుడు సర్వే నంబర్లతో కోర్టులో ఆర్డర్లు తెచ్చుకున్నారన్నారు. కోర్టు ఆర్డర్‌తో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం దళితులను ఆ భూమి నుంచి అన్యాయంగా తొలగించారని విమర్శించారు. దళితులు సాగు చేసుకుంటున్న భూమిపై పాసుపుస్తకాలు, 1బీ, అడంగల్ కలిగి ఉన్నారన్నారు. ఆక్రమణలకు పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా దళితులపై తప్పుడు కేసులను నమోదు చేయడం సరికాదన్నారు. వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు దండాల సుబ్బారావు మాట్లాడుతూ రెవెన్యూ యంత్రాంగం పెత్తందారులకు కొమ్ముకాసి దళితులకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. సీపీఎం నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ న్యాయమైన భూ సమస్య పరిష్కారం చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైతే సామాన్య పేదలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు, నాయకులు రెడ్డి వేణు, వై.మన్మథరావు, ఎం.తిరుపతిరావు, బీవీ రమణ, కె.సాంబమూర్తి తదితరులు ఉన్నారు.